క్లుప్తంగా

గృహ ప్రవేశానికి హాజరైన వైవీ సుబ్బారెడ్డి



సానికొమ్ము కుటుంబ సభ్యులతో వైవీ

పొదిలి రూరల్: దర్శి మాజీ ఎమ్మెల్యే సానికొమ్ము పిచ్చిరెడ్డి కుమారుడు వైఎస్సార్ సీపీ రాష్ట్రకార్యదర్శి సానికొమ్ము శ్రీనివాసరెడ్డి నూతన గృహ ప్రవేశానికి ఆయన సమీప బంధువు రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి హాజరయ్యారు. శుక్రవారం పొదిలికి వచ్చిన వైవీ సుబ్బారెడ్డికి పార్టీ నాయకులు సాదర స్వాగతం పలికారు. సానికొమ్ము కుటుంబ సభ్యులతో వైవీ మాట్లాడారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు వాకా వెంకటరెడ్డి, కేవీ రమణారెడ్డి, కళ్లం సుబ్బారెడ్డి, గొలమారి చెన్నారెడ్డి, గుజ్జుల సంజీవరెడ్డి, జి శ్రీనివాసులు, వై.వెంకటేశ్వరరావు, దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, మాబాషా, ఫిరోజ్ తదితరులు ఉన్నారు.

పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు



ఆర్టీసి డీఎం నరసింహులు

మార్కాపురం: కార్తిక మాసం సందర్భంగా శ్రీశైలం, అరుణాచలంతోపాటు ఏపీలోని పంచరామాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డీఎం నరసింహులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు ముందే రిజర్వేషన్ చేయించుకోవచ్చని పేర్కొన్నారు. ప్రస్తుతానికి 150 బస్సులను రాష్ట్రంలోని వివిధ పుణ్యక్షేత్రాలకు నడిపేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

మార్కాపురం ఆర్టీసీ డిపో పరిధిలో శనివారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ తెలిపారు. ప్రయాణికులు 99592 25699ను సంప్రదించి సమస్యలు, సలహాలు తెలియజేయవచ్చని స్పష్టం చేశారు.

17న స్త్రీ శక్తి ఆనందసోమ దీక్ష

గిద్దలూరు రూరల్: పట్టణంలోని షరాబ్ బజారులో గల అమ్మ భగవాన్ సేవా ఆలయంలో ఆదివారం స్త్రీ శక్తి ఆనందసోమ దీక్ష నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గుళ్లా పద్మావతి, డి.వరలక్ష్మి, డి.భవాని తెలిపారు. కుటుంబం, సమాజంలో స్త్రీల ప్రాముఖ్యత గురించి వివరించే ఈ కార్యక్రమం ఉదయం 9.45 నిమిషాలకు ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. మహిళలు మాత్రమే కార్యక్రమానికి హాజరు కావాలని శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు.

19న లిక్కర్ డిపోలో వేలం

మార్కాపురం టౌన్: మార్కాపురం లిక్కర్ డిపో పరిధిలో ఉన్న 101 ఫ్రీజర్లు, 101 ఇన్వర్టర్లు, 98 క్యాష్ చెస్టులు, 148 స్కానర్లు, 134 క్యాష్ కౌంటింగ్ యంత్రాలను ఈ నెల 19న వేలం వేయనున్నట్లు డిపో మేనేజర్ రాధాకృష్ణ తెలిపారు. గత ప్రభుత్వంలో మద్యం దుకాణాల్లో వీటిని ఉపాయోగించారని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనేవారు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించాలని స్పష్టం చేశారు.

ఏకగ్రీవ నీటి సంఘాలకు ప్రోత్సాహకాలు



మాట్లాడుతున్న డీఆర్వో ఓబులేసు

మార్కాపురం రూరల్: ఏకగ్రీవమయ్యే నీటి సంఘాలకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇస్తుందని జిల్లా రెవెన్యూ అధికారి ఓబులేసు తెలిపారు. శుక్రవారం స్థానిక డ్వాక్రా బజారులో డివిజన్ పరిధిలోని అధికారులకు నీటి సంఘాల ఎన్నికల నిర్వహణ ప్రక్రియపై అవగాహన కల్పించారు. డీఆర్ఓ మాట్లాడుతూ శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా తగు జాగ్రతలను తీసుకోవాలని తెలిపారు. గ్రామ సచివాలయాల వద్ద నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబిత అందుబాటులో ఉంటుందన్నారు. జిల్లాలో 88 మేజర్, 14 మీడియం, 240 మైనర్ ఇరిగేషన్ సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాస్టర్ ట్రైనర్, స్థానిక తహసీల్దార్ చిరంజీవి ఎన్నికల విధానంపై అవగాహన కల్పించారు.

స్మార్ట్ షాక్!



ట్రింగ్.. ట్రింగ్.. 'ప్రియమైన వినియోగదారుడా మీ విద్యుత్ కనెక్షన్‌పై రీచార్జ్ మరో మూడు రోజుల్లో ముగియనుంది. దయచేసి మీ స్మార్ట్ మీటర్‌ను రీచార్జ్ చేసుకుని విద్యుత్ సేవలను కొనసాగించగలరు. ధన్యవాదములు' త్వరలోనే ప్రజలంతా ఈ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వాయిస్ కాల్ వినేందుకు సిద్ధం కావాలి. స్మార్ట్ మీటర్లు వచ్చేస్తున్నాయి. గతంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై నిరసన గళం వినిపించిన కూటమి పార్టీల నేతలు అధికారం చేపట్టిన తర్వాత యూటర్న్ తీసుకున్నారు. స్మార్ట్ మీటర్లు ధ్వంసం చేయండి అని ప్రజలకు పిలుపునిచ్చిన చంద్రబాబునాయుడు సీఎం కాగానే మాట మార్చి అదే పనిని కొనసాగించేందుకు పచ్చ జెండా ఊపడాన్ని ప్రజా సంఘాలు విమర్శిస్తున్నాయి.

- చకచకా సాగుతున్న విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు
- గతంలో స్మార్ట్ మీటర్లను ధ్వంసం చేయాలని చంద్రబాబు పిలుపు
- ఇకపై బిల్లుల స్థానంలో ముందుగా నగదు చెల్లింపు
- రీచార్జ్ చేయకుంటే విద్యుత్ సరఫరా కట్
- మొదటి విడతలో ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య సంస్థల్లో ఏర్పాటు

బేస్తవారిపేట/మార్కాపురం:

విద్యుత్ వినియోగదారులను స్మార్ట్ మీటర్ల బెడద వెంటాడుతోంది. ప్రస్తుతం వినియోగిస్తున్న ఐఆర్‌డీ మీటర్ల స్థానంలో దశలవారీగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మొదటి దశలో ప్రభుత్వ కార్యాలయాలు, కమర్షియల్ కేటగిరీలో ఉన్న వాణిజ్య సంస్థలకు స్మార్ట్ మీటర్లు అమరుస్తున్నారు. భవిష్యత్‌లో గృహాలు, వ్యవసాయ బోర్లకూ అమర్చేందుకు రంగం సిద్ధం చేశారు. మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లోని విద్యుత్ సబ్‌డివిజన్ల పరిధిలో ప్రత్యేక బృందాలు స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేశాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు డిసెంబర్‌లోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కొత్త సంవత్సరం నుంచి వినియోగదారులపై అదనపు భారం పడే అవకాశం ఉంది.

మార్కాపురం సబ్ డివిజన్‌లో ఇప్పటి వరకు వెయ్యికి పైగా స్మార్ట్ మీటర్లు బిగించారు. మార్కాపురం టౌన్‌లో 590, పెద్దదోర్నాలలో 276, మార్కాపురం రూరల్‌లో 260 స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసినట్లు విద్యుత్ శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ప్రతి మండలంలో కనీసం 150 నుంచి 200 మీటర్లు అమర్చి వాటి పనితీరును పరిశీలించాలని ఇప్పటికే విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశాలు అందాయి.

ముందుగానే రీచార్జ్ తప్పనిసరి

సెల్ ఫోన్‌లో సిమ్ కార్డును ఎలా రీచార్జ్ చేసుకుంటామో అదే పద్ధతిలో ఇకపై విద్యుత్ మీటర్లనూ రీచార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. మీటర్లలోని క్యూ ఆర్ కోడ్‌ను ఫోన్‌లో స్కాన్ చేసి రీచార్జ్ చేసుకోకపోతే విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. మీటర్ రీడర్ల అవసరం లేకుండా ఆటోమేటిక్‌గా రీడింగ్ నమోదవుతుంది.

మీటర్ రీడర్ల ఉపాధికి గండం

ప్రస్తుతం ఐఆర్‌డీ మీటర్ల రీడింగ్ కోసం మీటర్ రీడర్లకు ఒక్కో బిల్లుపై సుమారు రూ.3.64 చెల్లిస్తున్నారు. స్మార్ట్ మీటర్లు వినియోగంలోకి వస్తే వారి అవసరం ఉండదు. దీంతో మీటర్ రీడర్లంతా రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కూటమి ప్రభుత్వం స్మార్ట్ రూపంలో ఇచ్చిన షాక్‌కు అటు వినియోగదారులతోపాటు దశాబ్దాలుగా మీటర్ రీడింగ్‌పై ఆధారపడి జీవనం సాగిస్తున్న సిబ్బంది విలవిల్లాడుతున్నారు.



మార్కాపురంలో స్మార్ట్ మీటర్లు బిగిస్తున్న విద్యుత్ సిబ్బంది

విద్యుత్ కనెక్షన్‌ల వివరాలు

గిద్దలూరు నియోజకవర్గం	
బేస్తవారిపేట	21,400
కంభం	26,217
అర్ధవీడు	16,533
గిద్దలూరు	38,000
కొమరోలు	15,909
రాచర్ల	16,989
మొత్తం	1,35,048
మార్కాపురం నియోజకవర్గం	
మార్కాపురం టౌన్	33,895
మార్కాపురం రూరల్	19,159
తర్లుపాడు	12,316
పొదిలి	28,485
కొనకనమిట్ల	20,013
మొత్తం	1,13,868

దోచుకునేందుకే స్మార్ట్ మీటర్లు

స్మార్ట్ మీటర్లతో వినియోగదారులకు మేలు అని అధికారులు చెబుతుండగా.. నష్టమే ఎక్కువని ప్రజా సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గంట గంటకూ మీటర్ రీడింగ్ తీసి డిమాండ్ పేరిట అధిక ధరలు వసూలు చేసే ప్రమాదం ఉందన్నది వారి ఆందోళన. ఒక్కో స్మార్ట్ మీటర్‌కు రూ.13 వేల నుంచి రూ.30 వేలను వాయిదాల పద్ధతిలో 96 నెలలపాటు వసూలు చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైందని ప్రజా సంఘాలు ఆరోపిస్తున్నాయి.

బాలికా విద్యతో సమాజాభివృద్ధి



గొట్లగట్టులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సురేఖ



పొదిలి కేజీబీవీలో మాట్లాడుతున్న సుభాషిణి

మార్కాపురం టౌన్/కొనకనమిట్ల/పొదిలి: బాల్యం అపూర్వం: బాలికా విద్యతో సమాజాభివృద్ధికి ఊతం లభిస్తుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం మార్కాపురం పట్టణంతోపాటు కొనకనమిట్ల, పొదిలి మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో బంగారు బాల్యంపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. మార్కాపురం మండలం రాయవరంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లలిత సలోమీ బాలల హక్కులు, బాల్య వివాహాలతో నష్టాలు, రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గొట్లగట్టు కేజీబీవీలో విద్యార్థుల తల్లిదండ్రులకు విద్యా హక్కు, నాణ్యమైన విద్య గురించి ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ వివరించారు. పొదిలి కేజీబీవీలో బాలికలకు పోక్సో చట్టం, నిర్భయ చట్టం, ఎడ్యుకేషన్ ఫండమెంటల్ రైట్స్ గురించి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుభాషిణి, సావిత్రి, ప్రత్యేకాధికారి అనూరాధ వివరించారు.

చట్టాలపై అవగాహనతో బంగారు బాల్యం



కంభంలో మాట్లాడుతున్నఆర్ఐఓ సైమన్ విక్టర్



బేస్తవారిపేటలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రంగనాయకులు

కంభం: జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు, అభివృద్ధి చెందే హక్కు బాలబాలికలకు ఉందని ఇంటర్ బోర్డు ఆర్ఐఓ సైమన్ విక్టర్ పేర్కొన్నారు. బంగారు బాల్యం వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో 'మానవహక్కులు తెలుసుకుందాం' అంశంపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. అధ్యాపకులు మురళీ కృష్ణ, లక్ష్మీ ప్రసన్న, శివలక్ష్మమ్మ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.


బేస్తవారిపేట: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కేజీబీవీలో బంగారు బాల్యం వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. బాల కార్మికుల నిర్మూలన, ఉచిత నిర్బంధ విద్య, లైంగిక వేధింపులు, ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ సీహెచ్ రమణారెడ్డి, సీడీపీఓ నీలోఫర్, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పశుగణన సర్వే పరిశీలన

పొదిలి: నగర పంచాయతీ పరిధిలోని కాటూరివారి పాలెంలో 21వ పశుగణనకు సర్వేను పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ బేబీరాణి శుక్రవారం పరిశీలించారు. పశుగణన రికార్డులు పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. సర్వేకు పశు పోషకులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏడీ డాక్టర్ వేణు, గోపాలమిత్ర జి.రాంబాబు, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.



సర్వేను పరిశీలిస్తున్న జేడీ బేబీరాణి



వేములకోటలో శివలింగాకృతిలో దీపోత్సవం



పొదిలి నిర్మమహేశ్వర ఆలయంలో జ్వాలా తోరణం వద్ద భక్తులు

మహాదేవ దేవం..



మార్కాపురం : మార్కండేశ్వరస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు వేకువజామునే ఆలయాలకు చేరుకుని కార్తీక దీపాలు వెలిగించారు. శివుడికి అభిషేకం నిర్వహించి మొక్కులు చెల్లించారు. సాయంత్రం వేళ పలు ఆలయాల్లో జ్వాలా తోరణం భక్తుల శరణుఘోష నడుమ వేడుకగా సాగింది. భక్తులకు అర్చకులు ఆశీర్వచనం, తీర్థప్రసాదాలు అందజేశారు.

- సాక్షి నెట్‌వర్క్



కొనకనమిట్ల : గొట్లగట్టులో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



బేస్తవారిపేటలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



కేతగుడిపి శివాలయంలో భక్తుల క్యూ



భీమలింగేశ్వర ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

తాగునీటి సరఫరాను త్వరలోనే పునరుద్ధరిస్తాం

తర్లుపాడు: కలుజువ్వలపాడు నుంచి లక్ష్మక్కపల్లికి వచ్చే పైప్‌లైన్ మరమ్మతులకు గురవడంతో రెండు నెలలుగా లక్ష్మక్కపల్లికి నీరు అందించడం లేదని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అంగీకరించారు. లక్ష్మక్కపల్లిలో తాగునీటి సమస్యపై శుక్రవారం 'సాక్షి'లో ప్రచురితమైన 'కన్నీళ్లు.. కామెర్లు' కథనంపై ఆర్‌డబ్ల్యూఎస్, వైద్యశాఖ అధికారులు స్పందించారు. పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టామని, లక్ష్మీపురం హెడ్‌వర్క్ వద్ద 75 హెచ్‌పీ మోటార్ రిపేర్ కారణంగా లక్ష్మక్కపల్లికి నీరు చేరడం లేదని పేర్కొన్నారు. మరమ్మతులు పూర్తయిన వెంటనే నీటిని అందిస్తామన్నారు. లక్ష్మక్కపల్లిలో రెండు బోర్ల నుంచి నీటిని సేకరించి పరీక్షించగా తాగేందుకు ఉపయోగించకూడదని తేలడంతో అక్టోబర్ 8వ తేదీన గ్రామంలో టాంటాం వేయించామన్నారు. ఎఫర్ట్ సంస్థ ఆర్ఓ ప్లాంట్ పనిచేయని కారణంగా కలుజువ్వలపాడు ఆర్ఓ ప్లాంటు ద్వారా రెండు రోజులకొకసారి నీరిస్తున్నామని వెల్లడించారు. లక్ష్మక్కపల్లిలోని వాటర్ ప్లాంటుకు మరమ్మతులు చేయిస్తామన్నారు. గ్రామంలో గత నెల 5వ తేదీ వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు మెడికల్ ఆఫీసర్ సోనీ తెలిపారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు 'చిరుత'



రగ్బీ జట్టుకు ఎంపికైన చిరుతను అభినందిస్తున్న పీడీ

కొనకనమిట్ల: వైఎస్సార్ జిల్లా కమలాపురంలో ఇటీవల నిర్వహించిన అండర్–14 రగ్బీ పోటీల్లో ప్రకాశం జట్టు తరఫున ఆడిన గొట్లగట్టు జెడ్పీ స్కూల్ క్రీడాకారుడు ఎం.చిరుత రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడని పీడీ బాలగురువయ్య పేర్కొన్నారు. శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థితోపాటు పీడీని హెచ్‌ఎం విజయలక్ష్మి, పీఎంసీ సభ్యులు అభినందించారు.

విద్యుత్ సర్దుబాటు చార్జీలు రాష్ట్ర ప్రభుత్వమే భరించాలి



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

గిద్దలూరు రూరల్: విద్యుత్ సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని సీపీఎం నాయకుడు టి.ఆవులయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాపోరు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆవులయ్య మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు విద్యుత్ సర్దుబాటు చార్జీలు రద్దు చేస్తామని హామీ ఇచ్చి విస్మరించిందని ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల పైన దాదాపు రూ.17 వేల కోట్ల విద్యుత్ సర్దుబాటు చార్జీలు మోపడం దారుణమన్నారు. సర్దుబాటు చార్జీలను రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని, ఉచిత ఇసుక విధానాన్ని పక్కాగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. దళితులు, గిరిజనులు, విద్యార్థుల పై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కరించాలన్నారు. పశ్చిమ ప్రకాశం అభివృద్ధి చెందాలంటే వెలుగొండ ప్రాజెక్టును వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో నాయకులు థామస్, వీరయ్య, ఆనందరావు, శ్రీనివాసులు, రాజశేఖర్ పాల్గొన్నారు.

పుస్తక పఠనం.. విజ్ఞానానికి దోహదం



మార్కాపురంలో మాట్లాడుతున్న వీరారెడ్డి



పొదిలిలో పుస్తకాలు తిలకిస్తున్న విద్యార్థులు

– విద్యాశాఖ రిటైర్డ్ ఆర్జేడీ డాక్టర్ వీరారెడ్డి

మార్కాపురం: పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందించుకోవచ్చని విద్యాశాఖ విశ్రాంత రీజినల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ అన్నపురెడ్డి వీరారెడ్డి పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పుస్తక పఠనంతో విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను గ్రంథాలయాలకు పంపాలని సూచించారు. ఉపాధ్యాయులు రవిశేఖరరెడ్డి, ఆదినారాయణ, అరుణకుమారి, సాంబశివరాజు తదితరులు మాట్లాడారు. మాదకద్రవ్యాలు యువత అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. శనివారం పాటల పోటీలు, దేశభక్తి, జానపదగీతాల పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రంథపాలకుడు గాయం వెంకట శివారెడ్డి తెలిపారు.

గ్రంథాలయాల్లో పుస్తక ప్రదర్శన

గిద్దలూరు రూరల్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలల్లో భాగంగా గిద్దలూరులోని గ్రంథాలయంలో శుక్రవారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఏర్పాట్లను గ్రంథపాలకురాలు నల్లబోతుల ప్రసన్నకుమారి పర్యవేక్షించారు. విశ్రాంత ఉపాధ్యాయులు రామిరెడ్డి, ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయుడు మస్తాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొదిలి: స్థానిక గ్రంథాలయంలో రెండో రోజు శుక్రవారం పుస్తక ప్రదర్శనను చిన్నారులు ఆసక్తిగా తిలకించారు. ఆకర్షణీయమైన పుస్తకాలను పిల్లల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు ఉపాధ్యాయుడు మురళీకృష్ణ తెలిపారు. పుస్తకాల ప్రాధాన్యత గురించి గ్రంథపాలకుడు కె.శ్యాంసన్ వివరించారు.